# కులవృత్తి

శ్రీ [illegible]

చాకలి... 

వ్రడంగి ధర్మయ్యకు జుట్టు నెరిసి నడుం వంగే వయసులో సుబ్బిగాడు పుట్టాడు. తల్లి వాణ్ని సుబ్బయ్యా అని పిలుస్తే తండ్రి 'సుబ్బిగా' అనేవాడు ముద్దుగా. సుబ్బిగాడికి రెండు మూడేళ్ళు వచ్చేసరికల్లా, గడికట్టే చేతికందిన వస్తువు నల్లా విసిరిపారెయ్యటమూ, విరగ్గొట్టటమూ, చేస్తూ, ముద్దుగా ఉండేవాడు

తల్లి వాడిమీద ఈగవాల నిచ్చేదికాదు. తండ్రి వాణ్ని కాలు కిందపెట్టనిచ్చేవాడు కాదు. అటువంటి వాతావరణంలో పుట్టి పెరిగాడు సుబ్బి.

వాడి విషయంలో ఇదివరకు లేని చిలిపి కయ్యాలూ, స్పర్థలూ ఆ భార్యా భర్తల మధ్య తరుచు తలెత్తుతూండేవి "ఈ మధ్య వాడి విషయంలో బద్ధకం పెరిగిపోయిందిలే నీకు" అనేవాడు ధర్మయ్య

ఏం చెయ్యను? ఇప్పుడు నీళ్ళుపోసి, బట్టలు తొడిగి తలదువ్వాను. అప్పుడే ఎంగా తయారయిందో అవతారం చూడు చేతికి దొరుకుతేనా?" అంది భార్య మహాలక్ష్మి.

తెల్లవారింది మొదలు చీకటిపడేవరకూ సుబ్బిగాడితో కాలక్షేపం చేసేవాడు ధర్మయ్య. పనికివెళ్ళినా దానిమీద మనసుండక చప్పున ఇంటికి వచ్చేసేవాడు.

ఆరోజు భార్య గట్టిగా చిరాకుపడింది ఆ మొర్నాడు అవసరం గడవాలంటే ఇంట్లో బొగ్గులదగ్గర్నుంచి బియ్యంవరకూ నిండుకున్నాయి నిజమే. అది విసుక్కోందంటే తప్పేంలేదు. తెల్లవారటం తరవాయి పిల్లవాడితో, కాలక్షేపం చెయ్యటం తప్పించి ఇంట్లో రోజు ఎలా గడవాలో తను ఆలోచిస్తున్నాడా? ఈ ఆలోచనతో లేచి గబగబా కొట్టుకు బయల్దేరాడు ధర్మయ్య. రెండు రోజులు ఇంటి ధ్యాసలేకుండా శ్రమించాడు - అంతే! - మరో వారం వరకూ ఇబ్బంది లేకుండా గడిచిపోతుంది. బుద్ధిపుట్టి పనిచేస్తే ధర్మయ్యకు చేతినిండా పనుంటుంది. దానికేం కొదవలేదు. సంపాదనకూడా బాగానే ఉంటుంది డబ్బు కోసం తడుముకోవాల్సిన అవసరం ఉండదు అయితే సుబ్బిగాడి ధర్మమా అని బద్ధకం బలిసిపోయింది ధర్మయ్యకు.

## 2

సుబ్బిగాడికి ఆరేళ్లు వచ్చేసరికల్లా మునుపట్లా కాకుండా కష్టపడి నాలుగురాళ్ళు వెనకేశాడు ధర్మయ్య. ఎప్పుడు చూసినా ఏదో ఒకటి చేస్తూనే అవుపించేవాడు. తోడిపనివాళ్లంతా అనేవారు "కొడుకు పుట్టింతర్వాత ధర్మయ్యకి యావ ఎక్కువై పోయింది సుమా!" అని. తనూ "తప్పుతుందా మరి" అనేవాడు.

కూడబెట్టిన డబ్బుతో ఎక్కడైనా మంచిస్థలం చూసి కొనిపారేస్తే అదృష్టం బాగుంటే కొడుకు హయాంలో కొంపా గోడూ వేసుకోవచ్చు. "తండ్రిని కాబట్టి ఆమాత్రం అప్పచెప్పకపోతే తను చేసిందేముంది? ఇది మా నాన్న సంపాదించాడు అనుకుందుకు చిహ్నంగా కూడా ఉంటుంది" అనుకున్నాడు ధర్మయ్య. అప్పటికే సుబ్బిగాణ్ని బడిలో వేసే వయస్సొచ్చింది తన కింతవరకూ ఆ ఉద్దేశమే లేదు. వాడూ కులవృత్తిని నమ్ముకుని కాలక్షేపం చెయ్యాలనే తను అనుకునేవాడు.

కొడుకును మంచి పనివాడుగా "తండ్రికి మించిన కొడుకురా" అనుకునేట్టుగా తర్ఫీదు ఇవ్వాలని ఉబలాట పడేవాడు. అంతేకాని వాణ్ని ఈ ఇంగ్లీషు చదువులు చదివించి ఉద్యోగాలు చేయించాలని అతను అనుకోనేలేదు. అవంటే అసహ్యం అని కాదుగాని అతని కా ఉద్దేశమే లేదు. నలుగురూ ఏవేవో చెప్పారు. వాళ్ళతోపాటు భార్యకూడా ఆ పాటే పాడింది మొదట్లో. తను అంతగా పట్టించుకోలేదు. మంచి రోజు మూసి దేముడికి మొక్కించి కొట్టుకు వెంట తీసుకెళ్ళాడు సుబ్బిగాణ్ని.

మర్నాడు భార్య సణుగుడు ప్రారంభించింది. నా మాటవిని వాణ్ని ఒళ్లో వేయించు...వాడు చదువుకుని ఉద్యోగం చేస్తుంటే చూడాలని నా కోరిక" అంది మహాలక్ష్మి. "ఆరేళ్లొచ్చాయి, ఈపాటికి రంగయ్య కొడుకు రత్నం చూడు: వీడి ఈడు వాడేగా; ఎలా కష్టపడతాడో. చదువులో పడితే ఈ వృత్తిమీద లక్ష్యం ఉంటుందా?" అన్నాడు ధర్మయ్య

"పోదూ ఇంతోటి మహా వృత్తీను. ఈ పాటి సుబ్బిగాడు సంపాదించలేకపోడు," అంది మహాలక్ష్మి.

ఆ మొర్నాడు కొడుకును ఒళ్లో వేసి నలుగుర్నీ పిల్చుకుని రాత్రి భోజనాల విందు ఏర్పాటుచేశాడు ధర్మయ్య. నలుగురూ ధర్మయ్య చేసిన పనికి 'సెభాష్' అని మెచ్చుకుంటూ పెద్ద చదువులు చదివి హోదాగా బ్రతకమని దీవించారు సుబ్బిగాడ్ని. ధర్మయ్య మాత్రం నెత్తిన అక్షింతలు చల్లుతూ "నా తండ్రి ఈ వృత్తిమీద ఆధారపడ్డాడు. మా తాత ముత్తాతలనుంచీ ఈ వృత్తిని నమ్ముకున్న వాళ్ళే. నువ్వు మాత్రం దాన్ని నిర్లక్ష్యం చెయ్యకు బాబూ" అన్నాడు మనసులో.

భార్య పట్టుదలమీదే అయిదో తరగతి వరకూ చదివించాడు సుబ్బిగాడ్ని. సుబ్బిగాడు చదువులో చురుగ్గానే ఉండేవాడు. మూడు సంవత్సరాల్లో అయిదో తరగతిలోకొచ్చాడు. రెండు తరగతుల్లో డబుల్ ప్రమోషన్లు కూడా ఇచ్చారు సుబ్బిగాడికి. మహాలక్ష్మి సంబరం చెప్పటానికి తరం గాదు. చిన్నగా నవ్వుకునేవాడు ధర్మయ్య.

ఆ యేటితో అయిదో తరగతి పూర్తయిపోయింది. ఘనుఘారంలో చేర్చాలి. అంటే పెద్ద చదువుల్లోకి వచ్చాడన్నమాట.

ధర్మయ్య అన్నాడు "ఇక చాల్లేరా బాబూ!"అని. భార్య ఇష్టపడలేదు. కొడుకూ కూడదూ అని భార్య అంటే లక్ష్యపెట్టేవాడు కాదు గాని సుబ్బిగాడికి కూడా చదువుకోవాలనే ఉంది గట్టిగా మందలిస్తే ఏడుస్తూ కూర్చున్నాడు. "సర్లే చదువుకుందువు గాని ఏడవకు" అని ధర్మయ్య ఆనాడే సుబ్బిగాణ్ని స్కూల్లో జాయిను చేశాడు. తల్లిబిడ్డల ఆనందం చూసి మనసులో తృప్తి పడేవాడు ధర్మయ్య.

గదిలో కూర్చుని రాత్రీ పగలూ ఏకధాటిగా చదివేవాడు సుబ్బిగాడు. కిటికీ బయట్నుంచి తోడి స్నేహితులు ఆడుకుందాం రమ్మంటే, తను కనబడుతున్నంతసేపూ వాళ్ళలాగే అల్లరి చేస్తారని కిటికీ రెక్కలు మూసేసేవాడు అప్పుడప్పుడు తల్లి మహాలక్ష్మి కసిరికొడుతూండేది వాళ్ళని. "ఆకతాయి వెధవలు. కూసేగాడిద సామెతలాగుంది" అంటూ విసుక్కుంటూ లోపలికొచ్చింది.

"ఏమిటది?" అన్నాడు ధర్మయ్య.

"ఏముంది? పనా పాటా...చదువుకుంటున్నవాణ్ని చెడగొట్టాలని - వెధవల్లారి వీళ్ళూను" అంది మహాలక్ష్మి.

"ఎవరే వాళ్ళు?" అని అడిగాడు ధర్మయ్య కొద్ది చిరాగ్గా.

"ఇంకెవరూ? ఆ రంగయ్య కొడుకు రత్నం వాళ్ళూను. వాళ్ళకి అబ్బలేదుగా చదువు; మనవాడు మాత్రం బాగుపడ్డ మేమిటని దుగ్ధ"

"పిల్లల్ని అలా అనకూడదే!"

"ఆ రంగయ్య పెళ్ళాంకు ఎంత కన్నె

# కులవృత్తి

్రగా ఉందో తెలుసా?" అంది మహాలక్ష్మి.

ఇందులో నిజానిజాలు ధర్మయ్యకు తెలియకపోలేదు. పైకి "వాళ్ళఖర్మం కాలింది. వాళ్ళ మనవాడ్ని చూసి అసూయపడటానికి? వాళ్ళ రత్నం తెలివితేటల ముందు మనవాడు చాల్తాడనా? రంగయ్య పిల్లవాడ్ని చదివించ దల్చుకోలేదుగాని చదివించేపాటి స్థితిగతులు లేనివాడుకాడు." అన్నాడు ధర్మయ్య.

ఇటువంటివే చిన్న చిన్న విషయాల్లో తేలిపోతూండేది భార్య. "సాటివాళ్ళలో కాస్త అక్షరజ్ఞానం ఉన్నవాడు సుబ్బిగాడే" అనుకునేది భార్య. ధర్మయ్య చివాట్లు పెట్టేవాడు. ఏమన్నా అంటే కంటనీరు పెట్టుకునేది. తనే జాలిపడేవాడు.

ఆ వరసని సుబ్బిగాడు మూడోఫారం వరకూ మంచి మార్కుల్లో క్లాసుకంతా మొదటివాడుగా ప్యాస్ అవుతూ వచ్చాడు.

మూడోఫారం పూర్తయి ఫోర్తుఫారం చదవాలంటే హైస్కూలు మారాలి. ధర్మయ్య మెల్లగా నసిగాడు" పోనీ ఇక్కడితో మానెయ్యకూడదూ" అని.

ఈసారి భార్యతోపాటు సుబ్బిగాడు కూడా విసుక్కున్నాడు. ఇదివరకు మల్లే ఏడవలేదు. "చదువులో ఉన్న గొప్ప, దుంగలు చెక్కుకోవటంలో ఉంటుందా!" అన్నాడు సుబ్బిగాడు. ధర్మయ్య మనసు కలుక్కుమంది. ఎంత నిర్లక్ష్యం?! తన తండ్రి వడ్రంగి. తనవంశీకులంతా ఆ వృత్తిని నమ్ముకున్నవాళ్ళే. పిచిప కాలం, పిదప బుద్ధులూ - కాకపోతే అంత తీసి కట్టుగా మాట్లాడతాడా?...మళ్ళీ ఎప్పుడూ ఆ ప్రస్తావన తెచ్చేవాడు కాదు ధర్మయ్య.

ఫోర్తుఫారంలో జాయినయి జీతం కట్టూ అంటే మాట్లాడకుండా జేబులో డబ్బుతీసి కొడుకుచేతిలో పెట్టాడు - అంతే! ఉలక లేదు పలకలేదు.

సుబ్బి ఫిఫ్తుఫారంలో కొచ్చే సరికల్లా చదువుకున్న స్నేహితులు ఎక్కువయ్యారు. అంతా తన క్లాసువాళ్ళే... సాయంత్రంపూట ఇంటిదగ్గర కూడా వాళ్ళతో నే గడిపేవాడు. రత్నం దూరంనించి చూస్తూ నిలబడేవాడు. సుబ్బి తనవేపు తిరిగి నవ్వితే మళ్ళీ నవ్వేవాడు. అంతే! మునుపటిలా గంటల తరబడి కబుర్లు చెప్పుకోటానికి వీల్లేకుండా ఉండేది. ఎప్పుడూ సుబ్బి చుట్టూ చదువుకున్నవాళ్లే తిరుగుతూ ఉండేవారు.

రత్నం తన పనితనం గురించి చెప్తుంటే సుబ్బిగాడు రత్నం ఒక మంచి పనివాడుగా మాత్రం ఊహించుకునేవాడు. అంతవరకే! ఆ పనితనం అంటే ఏమిటో తనకి తెలుస్తేగా? అందులో మెరుగులు, అనుపానులు రత్నానికి తెలిసినటు తనకు తెలియవు. ఆ వృత్తి తను నేర్చుకోలేదుగా?" అలా నేర్చుకోలేదనే చీకూ చింతా కూడా ఉండేదికాదు సుబ్బిగాడికి. పై పెచ్చు స్నేహితుల్తో తనకి బాడిద పుచ్చుకోవటమే చేతకాదు" అనేవాడు గర్వంగా. అంటే వాడి ఉద్దేశం తను కేవలం వడ్రంగి వంశంలో పుట్టినా తన కవేవీ అబ్బలేదని.

సుబ్బిగాడి కిప్పుడు తన్నెవరైనా 'సుబ్బిగా' అంటే అభిమానం వేస్తోంది. ఓనాడు తండ్రితో సహా చెప్పాడు ఇక ముందునుంచీ తన్ను సుబ్బారావు అని పిలవాలని. ధర్మయ్యకూడా అప్పుడప్పుడు అలవాటు కొద్దీ 'సుబ్బిగా' అన్నా మళ్ళీ సర్దుకునేవాడు.

ఆ ఏటితో సుబ్బారావుకి స్కూలు ఫైనలు పూర్తయింది. ఇక పై చదువులకి కాలేజీలో చేరాలి. సుబ్బారావు ఉత్సాహం చూస్తే ధర్మయ్యకు నోట మాట రాలేదు. అతనికి తోచాలిగాని ఈ వయసులో తను చెప్పి చేయించగలడా?" అనుకున్నాడు ధర్మయ్య. సుబ్బారావు కాలేజీలో చేరాడు. మొదటి టరమ్‌ఫీజు కట్టింతర్వాత పదిపదిహేను రోజులవరకూ పాఠాలే మొదలు పెట్టలేదు. రోజల్లా సుబ్బారావు ఇంట్లో ఉన్నట్టే ఉండేది. "కాలేజీ చదువంటే ఇదేనట్రా" అంది మహాలక్ష్మి నవ్వుతూ. సుబ్బారావు పగలబడి నవ్వేశాడు.

కాలేజి చదువంటే మాటలా? ఎలా లేదన్నా అదుగో ఇదిగో అంటే మూడొందలవరకూ ఖర్చయింది. ఒంద రూపాయిలు సుబ్బారావు బట్టలకిందా, పుస్తకాలకిందా ఖర్చయింది. అక్కడితో సరిపోతే బాగానే ఉండేది. సుబ్బారావు కాలేజీ చదువుతో మరో సమస్య ఎదురొకుంది. పొద్దున్న పదింటికి కాలేజీకి పోతే సాయంత్రం ఆరింటివరకూ ఇంటికి రావటానికి వీలుండేది కాదు. మధ్యాహ్నం భోజనం చెయ్యటానికి ఇంటికి రావాలంటే వ్యవధి చాలేది కాదు. అన్నం పట్టుకెళ్ళమని తల్లి అంటే సుబ్బారావుకి నామోషీగా ఉండేది. సాయంత్రం ఇంటికొచ్చేసరికి ముఖం డోక్కుపోయి ఉసూరుమంటూ అవుపించేవాడు. రాగానే పెరట్లోకి వెళ్ళి మంచి నీళ్లు తాగి చల్లటి నీళ్లతో ముఖం కడుక్కుంటేగాని సుబ్బారావుకి ప్రాణం లేచి వచ్చేది కాదు. "ఏడిసినట్టే ఉంది చదువు" అని మనసులో బాధకొద్దీ చిరాకుపడేవాడు ధర్మయ్య.

కొడుకు కష్టం చూడలేక సైకిలు కొన్నాడు ధర్మయ్య. దానికింద మూడొందలు ఖర్చయింది. డబ్బు పోతే పోయింది గాని కొడుకు సుఖపడుతున్నాడంటే ఆ డబ్బుపాటి చెయ్యదా ఈ సంతృప్తి?

మొదటి ఏడాది పూర్తయింది అనేసరికి సుబ్బారావు చదువుకింద వెయ్యి రూపాయిలు ఖర్చయాయి.

కొడుకు విషయంలో ఏ ఆశలయితే పెట్టుకున్నాడో అవన్నీ ఇప్పుడు తారుమారైపోతున్నాయి. వాడ్నిగురించి కన్న కలలన్నీ ఇలా పరిణమించాయి. స్థలం కొందామని కూడబెట్టిన డబ్బులో అప్పుడే చాలావరకూ సుబ్బారావు చదువుకిందే ఖర్చయిపోయింది. తనకా వయస్సు మళ్లింది చూపు సరిగా ఆనటం లేదు. మునుపటిలా కష్టించలేక పోతున్నాడు. పనిలో మునుపటంత ఉత్సాహం కూడా ఉండంట లేదు. సుబ్బారావు ఇంకా ఏడాది చదవాలి. అప్పటికిగాని చేతికక్కరకు రాడు. రంగయ్య తన ఈడువాడే. ఈ మధ్య దారిలో కనుపించాడు. కొడుకు రత్నం చేతికందింతర్వాత ఇప్పుడు చాలా సుఖంగా ఉందనీ, చిల్లరమల్లర పనుల్లాటివి తను చూసుకుంటే పెద్ద పనన్నీ వాడే సెట్టుకొస్తున్నాడనీ అన్నాడు.

రంగయ్యను తల్చుకుంటే పనీ పాటా నేర్చుకుంటే తన కొడుకూ అక్కరకు వచ్చేవాడుకదా అనిపించింది ధర్మయ్యకు.

ఆనాడు భార్యతో అన్నాడు చూశావా రత్నం ఎంత ప్రయోజకుడయ్యాడో" అని.

"మనవాడు మాత్రం కాడనా మీ ఉద్దేశం?" అని ఎదురు ప్రశ్న వేసింది మహాలక్ష్మి.

దానితో తనకేవిటి వాదన అని మాట్లాడకుండా ఊరుకున్నాడు ధర్మయ్య.

ఆరోజు ఇంట్లో చిన్న రభసజరిగింది. నిజంగా ఈ ఇరవైఏళ్ళలో ఆ ఒక్కసారే కొడుకుమీద అంతగా చిరాకుపడింది. కాఫీ హోటల్లో అరువు బాపతు పాతికా ఇమ్మని తలుపువార నిలబడి నసిగాడు సుబ్బారావు, ధర్మయ్యకు ఒళ్ళు మండుకుపోయింది. గట్టిగా చివాట్లుపెట్టి చేతిలో డబ్బు పెట్టింతర్వాత "కష్టం తెలుసుకుని మసులుకోవాలి" అన్నాడు ధర్మయ్య.

తప్పు మీదపెట్టుకుని సుబ్బారావు ఏం మాట్లాడుతాడు? గప్‌చిప్‌గా ఊరుకున్నాడు.

భార్యకూడా "పోనీ లెద్దురూ! ఇం

ప్పుడూ అరువు పెట్టడులెండి" అని సమర్థించింది. ఆ తర్వాత మహాలక్ష్మి పెరట్లోకి వెళ్ళిపోయింది. సుబ్బారావు కాలేజీకి వెళ్ళిపోయాడు. పదిదాటింది. అప్పుడే ఎండ చుర్రున పాకిపోతోంది. ధర్మయ్య మెల్లగా లేచి గదిలోకి వెళ్ళాడు. చొక్కా వేసుకుని చేతికర్ర ఊతంతో వీధిగుమ్మంలో కొచ్చేసరికి రత్నం "నేను బాబయ్యా!" అంటూ పలకరించాడు.

"నువ్వురా? ఎవరో అనుకున్నాను. చూపు బొత్తిగా మసకేసి పోయిందిరా రత్నం" అన్నాడు ధర్మయ్య. అరుగుమీద కూర్చుని "ఎలాగుందిరా పని?" అని ప్రశ్నించాడు ధర్మయ్య. "ఎక్కడన్నా మంచిస్థలం చూసికొనాలని ఉంది. ఎంతకాలమని చెప్పు వాళ్ళ కొంపల్లో వీళ్ళ కొంపల్లోనూ గడపటం?" అన్నాడు రత్నం.

"నువ్వేనట్రా స్థలం కొనేది?" అని ఆశ్చర్యంగా అడిగాడు ధర్మయ్య.

"నాన్న సంపాదన, నాది కలిపితే సంసారం గడిచిపోగా కాస్తోకూస్తో వెనకేశాం. అది వృథాగా ఖర్చయిపోకుండా ఈపని చేద్దాం అనిఉంది" అన్నాడు రత్నం.

"చేతిలో డబ్బుంటే మంచిపనికాదురా. శుభస్య శీఘ్రం... వెంటనే కొనెయ్యండి" అని సలహా ఇచ్చాడు ధర్మయ్య.

కాసేపు అవీ ఇవీ చెప్పుకుని రత్నం వెళిపోయాడు.

రంగయ్య అదృష్టవంతుడూ తను దురదృష్టవంతుడనే తలపు ధర్మయ్యకు గాఢంగా పట్టుకుంది. లేకుంటే ఈ వయసులో ఒంట్లో శక్తిలేకపోయినా చచ్చినట్టు పనిచెయ్యాలి. కొడుకు ఆశ ఇప్పుడప్పుడే లేదు. తనున్న పరిస్థితిలో ధర్మయ్యకు అకారణంగా కోపం వచ్చేది; నిష్కారణంగా విసుక్కునేవాడు, చిరాకు ఎక్కువయింది. తరుచు భార్యమీద ఎగిరిపడేవాడు.

"స్థలం కొందామనుకుంటే ఎంత డబ్బూ మనవాడి చదువుకే సరిపోయె" అన్నాడు ధర్మయ్య.

"ఏం చేసినా వాడికోసమేగా స్థలం బదులు చదువు చెప్పించాం. ఎలాగయితేనేం?" అంది మహాలక్ష్మి. కొడుకంటే ఇష్టంలేకనా విసుక్కోవటం? పనిచెయ్యలేని స్థితి, చెయ్యక తప్పని పరిస్థితులూ అతన్నలా అసందర్భపు మనిషిని చేస్తున్నాయి. భార్య ఊరుకునేమనిషి కాదు. "పెద్దవయసొస్తుంటే చిరాకు హెచ్చిపోతోంది" అనేది. దాంతో మరింత రెచ్చిపోయేవాడు. రొప్పుకుంటూ, బయటికి నడిచేవాడు.

## 3

బాడిద బుజాన్నవేసుకుని చిల్లర మరమ్మత్తులు చెయ్యటానికైనా సిగ్గువిడిచి బజార్నపడినా ఎవరన్నా ఎదురై ఎక్కడికి ధర్మయ్యా అంటే 'కొట్టుకురా' అని అబద్ధం ఆడేవాడు. చాటుమాటుగా బేడకీ పావలాకీ కూడా కష్టించేవాడు. పైకి నలుగురితో ఘరానాగా మసులుకునేవాడు. తోడి పనివాళ్ళంతా పరువుగా బ్రతుకుతుంటే తన ఖర్మం కాలిందా? బేడకీ పావలాకీ కూడా కక్కుర్తి పడాలా? ఈ తలపుతో చాలా బాధపడేవాడు ధర్మయ్య. ఒక్కడూ కొట్లో కూచుని దిగులుపడేవాడు. రోజుకో రూపాయి రెండూ సంపాదిస్తే మటుకు సంసారం గడిచిపోతుంది కాని సుబ్బారావుకి జీతం కట్టాలంటే వాళ్ళనీ వీళ్ళనీ దేవురిస్తేగాని అప్పు పుట్టేదికాదు. తీర్చాలంటే ఇంట్లో ఉన్నవన్నీ ఒకటొకటే తాకట్లలోకి పోతున్నాయి. ఒకటి రెండుసారు రత్నం దగ్గిర అప్పు పెటాడు. ఇంతవరకూ తీర్చలేదు. ఏముఖం పెట్టుకుని అడుగుతాడు మళ్ళీ. తోడివాళ్ళంతా స్థలాలు కొనటం, ఇళ్ళు కట్టటం గురించి ఆలోచిస్తుంటే తను ఎంతసేపూ అప్పుల గురించిన ఆలోచనల్లోనే మునిగిఉండటం ధర్మయ్య నెత్తి మొత్తుకునేవాడు.

ఆ దిగులుతోనే, కష్టంతోనే కొడుకు చదువు అయిందనిపించాడు ధర్మయ్య. ఇంకా పై చదువుల మాట ఇంట్లో పరిస్థితుల్ని బట్టి తలపెట్టటం మానేశాడు సుబ్బారావు. ఇంతకాలం సంసారంకోసం శ్రమించి, విశ్రాంతి తీసుకోవాల్సిన వయస్సులో వల్లమాలిన బాధ్యతలనుంచి తండ్రిని తప్పించవల్సిన బాధ్యత తనమీద ఉందనీ, తను అందుకు సర్వప్రయత్నాలూ చెయ్యాలనీ ఆత్రుత సుబ్బారావుకు లేకపోలేదు. దిగులుతో చిక్కి శల్యమయిన ధర్మయ్యకు నవ్వుతూ ధైర్యం చెప్పాడు సుబ్బారావు. తల్లి కొడుకుని గురించి ఆశగా కొండంత సంతృప్తి వ్యక్తంచేస్తూ భర్తకు ధైర్యం చెప్పేది. ధర్మయ్య మూలిగేవాడు.

సుబ్బారావు ఖాళీగా ఉండకుండా రోజూ కనిపించిన వాడినల్లా ఉద్యోగం గురించి వాకబులు మొదలుపెట్టాడు. పత్రికల్లో ప్రకటనలు చూసి వాటికి అప్లై చేశాడు. మొదట ప్రయత్నం హోదాగా పెద్ద ఉద్యోగాలకోసం ప్రయత్నాలు చేశాడు. ఎవర్ని కలుసుకోవాలో వాళ్లందర్నీ కలుసుకున్నాడు. ఈ ప్రయత్నంలో కొంత డబ్బుకూడా లంచంగా అయితేనేం, మరో ఖర్చుగానైతేనేం ఖర్చు పెట్టాల్సి ఒచ్చింది. లాభం లేకపోయింది. ఆఖరికి గుమాస్తాగానైనా చేరాలి అనుకున్నాడు మనసులో. అక్కడికి గుమాస్తాగా చేరటం సులభమైనట్లు. ఆఖరికి ఉద్యోగమంటూ దొరుకుతుందా అని దిగులుపడ్డాడు సుబ్బారావు. ఎప్పుడూ అదే ఆలోచన. చిన్నతనంలో భవిష్యత్తుని గురించి ఊహించుకున్నదానికీ జరుగుతున్నదానికీ ఏవిధమైన సంబంధమూ లేదు. అవన్నీ పగటి కలలు. ఇంట్లో పరిస్థితులు కలవరపెడుతుంటే పట్టుదల హెచ్చినా ఫలితం లేకపోవటంతో మనసులో ఏడ్చేవాడు.

కేసరి రత్నత్రయము

లోధ్ర

గర్భాశయ రోగ నివారిణి

స్త్రీలకు గలుగు ఋతుశూల, బహిష్ఠ కాకుండుట, అకాల బహిష్ఠ, మైల జాస్తిగాను తక్కువగాను పోవుట, కుసుమ రోగము సంతాన హీనత, రక్తహీనత, మలబద్ధము, సూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్లు, అరచేతులు మంట మొదలగు స్త్రీ మర్మవ్యాధులను కుదుర్చును.

అమృత

రక్తశుద్ధి ద్రావకము

ఇది రక్తహీనత, మలబద్ధము, అజీర్ణము, కీళ్ల నొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్పత్రువ, కడుపులోమంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతిని ముఖమునకు తేజస్సును యిచ్చును.

అర్క

సర్వజ్వర నివారిణి

ఆహార, విహారఋతుభేద దోషంబుల వలన ఆన్నాశయమునందు క్రిమికూటము చేరి పలువిధములైన జ్వరములు సంభవించుచున్నవి. వాతజ్వరము, పిత్తజ్వరము కఫజ్వరము, సన్నిపాతజ్వరము మరి యితర విషమజ్వరములను, కడుపులోప్లీహమును జ్వరగడ్డను కుదుర్చును.

కేసరి కుటీరం
లిమిటెడ్
రాయపేట : మద్రాసు-14.

తెనుగుజిల్లాలకు. నైజాముకు ఏజంట్లు:
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు
బెజవాడ. సికింద్రాబాదు.

# ★ కులవృత్తి ★

ఒక్కొక్కప్పుడు ఎంత దూరమో తెలియకుండా పరాగ్గా నడిచేసేవాడు. ఎంతసేపూ కష్టించి చెమట కార్చే ధర్మయ్య బడుగు దేహం కంటిముందు నిలిచేది. కడుపులో చెయ్యి పెట్టి దేవేస్తున్నట్టుగా బాధపడే వాడు సుబ్బారావు.

ఈ ఉద్యోగంకోసం పడే ఆరాటంలో ప్రపంచంఅంతా దయారహితంగా అవుపించేది. మనిషికి మనిషికీ మధ్య ఇంత అగాధం ఎందుకుండాలి? ఎవరు సృష్టించారు? తనకెందుకు ఉద్యోగం దొరకదూ? అనుకున్నాడు సుబ్బారావు. ఎంతసేపూ లోకం తన కేదో అన్యాయం చేస్తోందనే తలపు అతన్ని గాఢంగా పట్టుకుంది. ఎవర్నీ పలకరించేవాడుకాదు. వ్యక్తుల తరహా లెటువంటివో తనకు తెలియకపోయినా మనుష్యుల్ని సిద్ధాంతాల్లోంచి చూ[illegible] డబ్బున్న వాళ్ళంటే ఏవగించుకునేవాడు. ముఖం ఎత్తి మాటాడేవాడుకాడు. అడుక్కునే వాళ్ళంటే సుబ్బారావుకి గుండె కరిగి పోయేది. జేబులోంచి కానీ తీసి మూకుటులో వేసి చరచరా వెళ్ళిపోయేవాడు. ఎన్నడూ లేనిది ప్రతి విషయంలోనూ అనుమానం, ఏవగింపూ ఎక్కువయింది సుబ్బారావుకి. "సుబ్బారావు పూర్తిగా మారిపోయాడురా" అన్నాడు పాతస్నేహితుడు వెంకట్రావు. వెంకట్రావు బాగా ఉన్నవాడు. సుబ్బారావు ఆవేశంగా" ఎవరు మారినా మీరుమటుకు మారరు. మారాల్సిన అవసరం ఉన్నా లక్ష్య పెట్టరుగా" అన్నాడు.

అయోమయంగా చూస్తూ నిలబడిపోయాడు వెంకట్రావు.

## 4

మనసులో తండ్రి కిచ్చిన వాగ్దానం గుర్తుకొస్తే ఇంటిముఖం చూడ్డానికే సిగ్గుగా ఉంటుంది. రోజల్లా ఇలా తిరగటం వేళకి భోజనానికి ఇంటికి చేరటం - ఇంతేనా? తనకి ఉద్యోగం దొరకదా?

"ఏరా ఎక్కడా దొరకలేదూ?" అన్నాడు ధర్మయ్య.

"ఎందుకు దొరకదు? ఉద్యోగం అంటే మాటలా మరి?" అన్నాడు సుబ్బారావు.

ధర్మయ్య దిగులుగా నవ్వాడు. సుబ్బారావు తలవొంచుకుని వెళ్లిపోయాడు. ఆ రాత్రల్లా అదే ఆలోచన. ఏవిటి చెయ్యటం? ఎటూ తెగని ఆలోచనల్లోంచి తెప్పరిల్లేసరికి దూరంగా మూడు గంటలు కొట్టటం విన్నాడు. కిటికీలోంచి చిన్నగా వానజల్లుమీదికి కురుస్తోంది. కిటికీ రెక్కలు మూసి పడుకోబోతుంటే తండ్రి గొంతు చించుకుని దగ్గటం వినిపించింది. వర్షపుహోరు హెచ్చి కిటికీలోంచి చూస్తే అంతా అలుముకుపోయినట్లుగా అవుపిస్తోంది. ముందుదారి తెలియక అగమ్యగోచరంలా ఉంది తనస్థితి. తండ్రి కష్టపడుతున్నాడు. చిరివకి ఓ ఆలోచన తట్టింది. ఏలూరులో ఇద్దరు ముగ్గురు స్నేహితులున్నారు. వాళ్ళకి రాసి వాకబు చెయ్యాలి. అదృష్టం బాగుంటే కలిసిరాకూడదూ? అనుకున్నాడు.

నిట్టూరుస్తూ లైటు తగ్గించి పడుం వాల్చాడు.

రాత్రి బాగా పొద్దుపోయేవరకూ మెలుకువగా ఉన్నాడేమో తెల్లవారి లేచేసరికి బారెడు పొద్దెక్కింది. లేచి కళ్లు నులుపుకుంటూ నడవలోకి వచ్చేసరికి బుజాన్న బాడిద తగిలించి గుమ్మం దిగుతున్న తండ్రి అవుపించాడు. సుబ్బారావు కెందుకో శరీరమంతా సిగ్గుతో కుంచించుకుపోయింది. ఆ క్షణంలో పెద్ద తప్పు చేసినవాడిలా బాధ చెందాడు. తన్ని కన్నందుకు ఇదా శాస్తి తండ్రికి అనుకున్నాడు. ఈ బాధతో రాత్రి తట్టిన ఆలోచనపట్ల పట్టుదల హెచ్చింది. ముఖం కడుక్కుని కాఫీ అన్నా పుచ్చుకోకుండా గదిలో కెళ్లి ఉత్తరం రాస్తూ కూర్చున్నాడు.

తను ఉత్తరం రాసిన వారంరోజులుకి జవాబు అందుకున్నాడు. ఉద్యోగాలయితే ఉన్నాయని, తనలాంటివాళ్ళు చెయ్యాల్సినవి కావని, వాటి వివరాలు రాసుకొచ్చాడు. భద్రాచారి అనే స్థితిమంతుడున్నాడని, వాడివద్ద గుమాస్తాగా నమ్మకమైనవాడు కావాలనీ తనకు ఎరిగున్న వాళ్ళ ద్వారా తెలిసిందనీ రాశాడు. జీతం ఏభై ఇస్తాట్ట. ఇక పైన దమ్మిడీ అడిగి ప్రయోజనం లేదనీ రాశాడు. మనసు కొంత తెరిపిన పడింది సుబ్బారావుకి. అయితే తండ్రి ఒప్పుకుంటాడో లేదో? ఆ ఉత్తరం తండ్రికి చూపించటానిక్గానీ, ఆ ఉద్యోగం సంగతి ఎత్తటానిగ్గానీ ఏదో తప్పుచేసినవాడిలా సిగ్గుపడుతున్నాడు. "ఏదైనా సానుకూలపడిందా" అంటే చప్పున "ప్రయత్నిస్తున్నాను" అన్నాడంతే. ఉత్తరం సంగతి ఎత్తలేదు. ఆ రాత్రల్లా దీర్ఘంగా ఆలోచించాడు. తెల్లవారింతర్వాత సుబ్బారావు వీధి గదిలోకొచ్చి నిలబడ్డాడు. ధర్మయ్య అంపం పదును పెడుతున్నాడు. తల్లికూడా ఆ సమయంలో అక్కడే ఉంది. నెమ్మదిగా మనసులో చెప్పదల్చుకున్నది చెప్పేశాడు "ఉద్యోగం దొరికింది" అన్నాడు. ఈ సంతోషవార్త చెప్పటంలో ఎంత ఉత్సాహం వ్యక్తం చెయ్యగలిగితే ఆ ఉద్యోగం విలువకూడా ఎదురు వాళ్లకి ఆ అంతస్థులోనే అర్థం చేసుకోగలరు. అని సుబ్బారావు ఉద్దేశం. అయితే అతి మామూలు విషయం ప్రస్తావిస్తున్నట్టే చెప్పాడు.

"ఎక్కడరా?" అన్నాడు గంపంత ముఖంతో ధర్మయ్య.

అయితే ఆ ముఖం మరుక్షణంలో దమ్మిడీ కొసంతయిపోయింది ఏలూరులో ఉద్యోగం అనీ ప్రస్తుతం ఏభై ఇస్తారని తర్వాత మన సామర్థ్యాన్నిబట్టి అదృష్టం బాగుంటే వృద్ధిలోకి రావచ్చనీ ఉన్నవీ లేనివీ చెప్పేశాడు సుబ్బారావు. తండ్రిని సుముఖుడ్ని చెయ్యాలని అనేకవిధాల ప్రయత్నం చేసాడు. ధర్మయ్య అవీ-ఇవీ తేల్చలేదు. మౌనంగా తన పనిలో నిమగ్నడైపోయాడు.

అయితే తల్లిని సుముఖురాల్ని చెయ్యటానికి సుబ్బారావుకి ఎక్కువసేపు పట్టలేదు. "నాకుమటుకు ఇంత చదువు చదివింతర్వాత ఈపాటి ఉద్యోగం చెయ్యటం మనసా చెప్పు. పరిస్థితుల్నిబట్టి తొందరపడాల్సి వస్తోంది. నాన్నని ఒప్పించాల్సిన బాధ్యత నీదమ్మా" అన్నాడు సుబ్బారావు. తల్లి సరే లెమ్మంది.

ఆ సాయంత్రం ధర్మయ్య అన్నాడు. "పుట్టినప్పట్నుంచీ ఈ ఊరులో పెరిగాను. పెద్దవాణ్నయి పనిపాటలు నేర్చుకున్నాను. ఈ వయసులో మరోవూరు పోవాలంటే అదోలా అనిపిస్తోంది" అని.

సుబ్బారావు చెప్పాడు "నాకుమటుకు మనసా? పరిస్థితులు..." ఈ ఆఖరి మాటలు సుబ్బారావు నోటిలోంచి ఊడిపడలేదు. ధర్మయ్య ఆవేశంగా అరిచాడు "ఎంతో ఆశ పెట్టుకున్నాను. అన్నీ తప్పేకావు. నిన్ను నీవు ఉద్ధరించుకోలేని స్థితిలోకి జారిపోయావు. రత్నం చూడు. సుఖంగా కాలక్షేపం చేస్తున్నాడు. రంగయ్య అదృష్టవంతుడు"

సుబ్బారావు తల వంచుకుని కావక్కిరిగాడు. ధర్మయ్య మెల్లగా భుజం తట్టి "మరేం బాధపడకు. నా జీవితం చాలావరకూ గడచిపోయింది. నిర్వాకం చేద్దామనుకున్నాను. దేవుడు తప్పు తలిచాడు. నీ విషయమే ఆలోచిస్తాను. భగవంతుడు దయదల్చి మంచి ఉద్యోగం దొరికితే మంచిదే. లేకుంటే ఓ గుణపాఠం నేర్చుకుంటావు" అన్నాడు.

సుబ్బారావు ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా వీధిలోకి నడిచాడు. తండ్రి అన్న ప్రతి ముక్కా అతని మెదడులో బాగా పనిచేస్తున్నాయి. "తను చేసింది తప్పు పనా? కాదే! చదువుకున్నాడు. ఉద్యోగం చెయ్యాలనుకుంటున్నాడు. ఇందులో తప్పేముంది?" ఈ విషయం అంతు తేల లేదు సుబ్బారావుకి. ఆ రాత్రి ఎలాగయినా తండ్రిని ఒప్పించి మర్నాడు ఏలూరు ఉత్తరం రాయాలనుకున్నాడు.

ధర్మయ్య కొడుకు తాపత్రయం చూసి జాలిగా "మనసులో బాధకొద్దీ అన్నాను కానీ రాక తప్పుతుందా మరి" అన్నాడు. కొంచెంత బరువు తీరినట్లనిపించింది సుబ్బారావుకి

ఆ మర్నాడు ఏలూరు ఉత్తరం రాశాడు తర్వాత మంచిరోజు చూసి ఏలూరు బయల్దేరాడు. ముందు తనువెళ్ళి మంచీ చెడూ చూసుకున్న తర్వాత తండ్రికి ఉత్తరం రాయొచ్చు. అనుకున్నాడు.

ఏలూరు వెళ్ళింతర్వాత అంతా అనుకున్నట్టుగా సవ్యంగానే జరిగిపోయాయి. భద్రాచారి తన్ను గుమాస్తాగా చేర్చుకోవటానికి ఇష్టపడింతర్వాత జీవితం ఖాయం చేసుకుని చిన్న పెంకుటిల్లు పదిహేను రూపాయలకి అద్దెకి తీసుకుని తండ్రికి ఉత్తరం రాశాడు బయల్దేరి గమ్మని. తర్వాత అయిదారు రోజుల్లో తల్లి తండ్రి సామానుతో సహా వచ్చేశారు. ఆ సామాను సర్దుకోవటం, హడావిడిలో రెండు రోజులు గడిచిపోయాయి. ఆ సాయంత్రం ధర్మయ్య అడిగాడు భద్రాచారి అంటే ఎవరో, ఆ ఉద్యోగమేమిటో, జీతమెంతో వివరంగా చెప్పమని.

సుబ్బారావు తెచ్చిపెట్టుకున్న నవ్వుతో, షావుకారు గురించి ఉన్నవీ లేనివీ పొగిడి, ముందు ముందు అభివృద్ధిలోకొచ్చే అవకాశం తప్పకుండా ఉంటుంది అన్నాడు. ఇంతపెద్ద అబద్ధం ఆడింతర్వాత సుబ్బారావు మరో ప్రశ్న వేసే అవకాశం ఇవ్వకుండా 'పనుంది' అంటూ లేచి వీధిలోకి వెళ్ళిపోయాడు. అప్పుడే చీకటి పడుతోంది. మహాలక్ష్మి దీపం వెలిగిస్తూ భగవద్ధ్యానం చేసుకుంటోంది.

ధర్మయ్య మెల్లగా వీధిగుమ్మంలోకొచ్చి నిలబడ్డాడు. వచ్చేపోయే జనంతో రోడ్లన్నీ రద్దీగా కోలాహలంగా ఉన్నాయి. ధర్మయ్య ఆలోచన్లో పడ్డాడు. కళ్ళు చెమ్మగిలాయి. అరవైఏళ్ళ సంబంధం తెంచుకుని ఈవూరు రావాల్సొచ్చింది. ఎవరో ఆత్మీయుడు దూరమైనట్టుగా స్వగ్రామం తల్చుకుని బాధపడ్డాడు. ఇటువంటి అనుభవం తనకెప్పుడూ కలగలేదు. నాది అనేది ఏదీ లేక పోయినా ఆ గడ్డమీద జీవించిన మమకారం అతని ప్రేగుల్ని చుట్టుకుపోయింది. తన కావూరుతో ఋణం తీరిపోయింది.

## 5

భద్రాచారి బాగా ఉన్నవాడు. ఏకాకిగా ఉంటున్నాడు. భార్య చనిపోయి రెండు సంవత్సరాలయింది. ఇద్దరాడపిల్లలూ అత్తవారింటికి వెళ్ళిపోయినా తరుచువాళ్ళని అల్లుళ్ళతో సహా పిలిపించి వారం పది రోజులు ఉంచుకుని సంతోషపడుతూంటాడు.

క్రమంగా సుబ్బారావు వారి కుటుంబ విషయాలన్నీ తెలుసుకోగలిగాడు. భద్రాచారి బహు కోపిష్ఠి మనిషి అని తెలుసుకోవటానికి సుబ్బారావుకు ఎక్కువ కాలం పట్టలేదు. గడించింది చాలదన్నట్లు అతను పడే తాపత్రయం చూస్తుంటే సుబ్బారావుకి ఆశ్చర్యం వేసేది. కొత్తలో నవ్వుకునేవాడు. రాను రాను ఏవగింపు పుట్టేది. భద్రాచారి ఎక్కువ గంభీరంగా ముభావంగా ఉండేవాడు. అతని మనసుకు నచ్చని పనేదైనా జరిగితే ముఖం ఎర్రబడేసుకుని చిరాకుపడేవాడు. ఒకటి రెండుసార్లు తన విషయంలో కూడా ఇలాగే జరిగింది. చచ్చేటంత అభిమానపడ్డాడు సుబ్బారావు.

మర్నాడు యజమానిగురించి ఎత్తుకొస్తూ "మహాకోపిష్ఠిలాగున్నాడే" అన్నాడు వంటవాడితో.

వంటవాడు భయంగా పలువేపులా పరీక్షించి రహస్యంగా "కర్కోటకుడు. బతికున్నంత కాలం రాసి రంపాన బెట్టాడు భార్యని. ఇప్పుడు తల్చుకుని బొల్లి ఏడుపు లేడుస్తాడు. ఎవడికి జాలి వీడంటే?" అన్నాడు.

సుబ్బారావు ఏదో అడగాలనుకుని తనకెందు కన్నట్లుగా మాట్లాడకుండా ఊరుకున్నాడు.

వంటవాడు చెప్పుకుపోతున్నాడు.

"విషం పెట్టి చంపేశాడంటారు. ఎంత వరకూ నిజమో తెలియదు సుమండీ" అని క్షణం ఆగి "నిజమైనా కాకపోయినా అందుకు తగినవాడే సుమండీ" అన్నాడు.

ఈ ధోరణి ఇలా సాగనివ్వటం ప్రమాదమనిపించింది సుబ్బారావుకి. ఒస్తానని చెప్పి తప్పించుకున్నాడు. ఇంటికి ఒస్తుంటే దారిలో ఆనాడు జరిగిన పరాభవం తల్చుకుని మధనపడసాగాడు. చెట్టంత మనిషిని పట్టుకుని ఎన్ని మాటలన్నాడు. సుబ్బారావు జీవితంలో ఇదో కొత్త అనుభవం.

అయితే మర్నాడు వంటవాడి చరిత్ర వింటుంటే కేవలం అంతమాత్రానికి అభి [illegible] పౌరుషాలు పెట్టుకుంటే ఈ ఉద్యోగం ఎంతకాలమో చెయ్యలేమనీ తేలింది. ముందు ముందు ఎటువంటి పరిస్థితులు ఎదురొక్క వలసివస్తుందో అనే దిగులు పట్టుకుంది సుబ్బారావుకి. ఓనాడు పుస్తకంలో లెఖ్ఖ రాస్తుంటే కలం కక్కేసింది. భద్రాచారి పక్కనే ఉన్నాడు. "కలంలో సిరా అయిపోతే పోసుకోవాలని తెలియదూ?" అన్నాడు విసుగ్గా.

సుబ్బారావు మనస్సు కలుక్కుమంది. మాట్లాడకుండా తల వంచుకుని పని చేసుకుపోయాడు. వంటవాడిముందు తను మాటపట్టం తల్చుకుంటే తలకొట్టేసినట్టుగా అనిపించింది.

చీకటి పడింది. సుబ్బారావు ఆఫీసుగదికి తాళం వేసి ఇంటికి బయల్దేరబోతుంటే వంటవాడు పలకరించాడు. సుబ్బారావు మాట్లాడలేదు.

"మీరు బాధపడుతున్నారు కదూ? అలా అయితే. ఎంత కాలమో పనిచెయ్యలేరు" అన్నాడు వంటవాడు.

మారు జవాబు చెప్పకుండా ఇంటికొచ్చేశాడు సుబ్బారావు. "అలాగున్నావేం?" అని అడిగింది తల్లి. "ఏమీ లేదు" అంటూనా న్చేశాడు సుబ్బారావు ఇటువంటివన్నీ ఇంటిదగ్గిర చెప్పేవాడుకాదు. మనసులో మటుకు బాధపడేవాడు.

* * *

రంగయ్యరాసిన ఉత్తరం ధర్మయ్య చదువుతుంటే తలుపువార వింటూ నిల్చున్నాడు సుబ్బారావు. సుబ్బారావు చదువు


సకల దంత వ్యాధులకు

కోతిమార్కు నల్ల పండ్లపొడి



ప్రతిచోట దొరకును.

నోగి అండ్ కో

87 చైనాబజార్ రోడ్, మద్రాసు-1

బెజవాడ స్టాకిస్టులు: ప్రిటట్ ప్రమోటింగు కార్పొరేషన్, పోస్టుబాక్సు నెం. 50 గాంధీనగరం.

# ★ కులవృత్తి ★

కున్న చేతికందినందుకు సంతోషిస్తున్నానని తన కొడుకు రత్నం గురించి తన కింక చింత లేదనీ వాడో దారిన పడ్డాడనీ సంతృప్తి వ్యక్తంచేస్తూ రాసుకొచ్చాడు.

*   *   *

స్వేచ్ఛకోసం పెనుగులాడే స్వభావం మానవసహజం; ప్రకృతి ధర్మమూను. సుబ్బారావు కిప్పుడు వాటిగురించి ఆలోచించి ప్రయోజనంలేదు. ఈ సంఘర్షణ అనంతమైనది.

## 6

అప్పుడే అయిదారు నెల్లయింది సుబ్బారావు పనిలో చేరి. ఈ ఆరునెల్లో సుబ్బారావు ఎన్నో విషయాలు అనుభవ పూర్వకంగా గ్రహించాడు. భద్రాచారివద్ద ఇంక్రిమెంటు విషయం ఎత్తి ప్రయోజనం లేదు అని తెలిసిపోయింది. వంటవాడు ఓ రూపాయి జీతం హెచ్చు చెయ్యమంటే ఆరోజల్లా వాడ్ని తిడుతూనే ఉన్నాడు భద్రాచారి. "ఇంతకంటే తక్కువకే దొరక్కపోరు" అన్నాడు.

వంటవాడు తన దగ్గిర ఆ ప్రస్తావన తెచ్చి కళ్ళనీళ్లు కార్చాడు. సుబ్బారావు చూడలేక ఇంటికొచ్చేశాడు.

ధర్మయ్య అడిగాడు "జీత మేవన్నా పెంచారా?" అని.

"రెండుమూడు నెల్లో ఇవ్వచ్చు" అన్నాడు సుబ్బారావు. "నిజమే కామోసు" అనుకున్నాడు ధర్మయ్య.

పనిమాత్రం ఊపిరి సలపకుండా ఉండేది. జీతం మామూలే. రాత్రి పదింటివరకూ చెమట ఓడ్చి పనిచేసి ఇంటికొచ్చేసరికి "ఇంత ఆలస్యం అయిందేరా?" అని తల్లి అడిగితే స్నేహితుల్తో షికారు వెళ్ళాననో, సినిమాకనో అబద్ధం చెప్పేవాడు. మళ్ళీ తనే ఈ అబద్ధాల బ్రతుకుని తల్చుకుని చిరాకు పడేవాడు. తండ్రికి తన్నుగురించి ఏర్పడ్డ అభిప్రాయం నిజంకాదని నమ్మంచాలనే ప్రయత్నంలో ఇటువంటి అబద్ధాలు ఆడక తప్పటంలేదు.

భద్రాచారికి ఊళ్ళో నాలుగు మేడలున్నాయి. అవన్నీ చిన్నచిన్న వాటాలుగా అద్దెలకిచ్చాడు. ఓ చిన్న పేటలా గుంటుంది ఒక్కొక్క మేడ. ప్రతినెలా అద్దెలు వసూలు చెయ్యవలసిన బాధ్యత సుబ్బారావుది. ప్రతి నెలా పెద్దజట్టే జరుగుతే గాని అద్దెలు సక్రమంగా వసూలయేవి కావు. ఈ తగాదాలతో సుబ్బారావు తల బట్టకట్టిపోయేది. రెండు మూడు తారీకుల్లో అద్దెలు పూర్తిగా వసూలు కాకపోతే భద్రాచారికి తను సంజాయిషీ చెప్పుకోవాలి. అయితే నోరు చించుకుని అరిచినా ప్రయోజనంలేని ముసలమ్మగోడు ప్రతీ నెలా తప్పేదికాదు. కొడుకూ, కోడలూతో సహా తూర్పువేపు భాగంలో ఉంటున్నారు. అద్దె విషయం ఎత్తేసరికల్లా కాళ్ళావేళ్ళా పడేది. ఒకటి రెండు నెలలు తన జీతంలో నేకట్టి ఆ తర్వాత ఆవిడవద్ద వసూలు చేసుకునేవాడు.

ఈ నెల్లోకూడా పరిస్థితులలాగే ఒచ్చాయి. ముసలమ్మ నాలుగురోజులు ఆగమని మరీ మరీ ప్రాధేయపడింది. సుబ్బారావు చెప్పాడు "నే చెయ్యగలిగేది ఏవీ లేదు. షావుకారి సొమ్ముగాని నాది కాదు నీమూలాన నేను బాధపడాలి. నాగురించి కొంతమంది బాధపడేవాళ్లున్నారు." అని.

ఆ ముసల్ది చాలా పేదదనీ, చాలా కష్టాలు పడుతోందనీ, చెప్పేసరికి ఏకళనున్నాడో భద్రాచారి అద్దె విషయం రొక్కించలేదు. ఈ సమయం కనిపెట్టి ఇంక్రిమెంటు విషయం ఎత్తాడు సుబ్బారావు. వినిపించుకోనట్టే భద్రాచారి నటించడంతో ఇక మళ్ళీ ఆ ప్రస్తావన తీసుకురాలేదు సుబ్బారావు.

ఆ నెల జీతం తీసుకుని ఇంటికి ఒచ్చేశాడు సుబ్బారావు. తెచ్చిన జీతం మర్నాటికల్లా చిల్లి దమ్మిడీ మిగలలేదు. ఊరంతా అప్పులు తల మునిగిపోయేట్టుగాఉన్నాయి. లేకుంటే ఎలా గడుస్తుంది? పదిహేను రూపాయలు అద్దెకిందే పోతుంటే తక్కిన ముప్పై అయిదు రూపాయల్తో సంసారం గడవాలంటే మాటలా? ఇంతవరకూ అప్పులు చెయ్యడమే కాని తిరిగి దమ్మిడీ తీర్చలేక పోతున్నాడు. నడిబజార్ని తిరగటానికే సిగ్గుపడుతున్నాడు. ఊపిరి సలపని పనితో దైహికంగా కూడా బాధపట్టం జరుగుతోంది. తప్పటంలేదు. అప్పుడప్పుడు వంటవాడు సానుభూతి చూపించేవాడు

వారంనుంచీ ఆకాశం ముసురేసి ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్నాయి. ఎక్కడికీ కదలటానికి వీల్లేకుండా ఉంటే చిరాకు వేసేది. తండ్రికి ఆరోగ్యం బాగుండక రెండు రోజులు మంచం దిగలేదు. అక్కడితో తగ్గిపోతుంది; ఏమీ కాదనుకున్న నలత మరో పదిరోజులవరకూ ఊపిరి సలపని దగ్గుతో పీల్చి పిప్పిచేసి మనిషిని ఆర్చేసింది. ఉన్నట్టుండి కాళ్ళు లాగుతున్నాయనో, కళ్ళు మండుతున్నాయనో అంటూండేవాడు. మహాలక్ష్మి కన్నీళ్ళు కార్చి లోలోపల ఏడ్చేది. ఎందుకన్నా మంచిదని రెండు రోజులు సెలవుపెట్టి ఇంట్లోనే ఉండిపోయాడు సుబ్బారావు.

అవాల్టికి ధర్మయ్య మంచానపడి పదమూడురోజులయింది. బాగా నీరసించిపోయాడు. తల్లి పెరట్లో పనిచేసుకుంటోంది. గుమ్మంవార నిలబడ్డ కొడుకును దగ్గిరకు రమ్మని సంజ్ఞ చేశాడు ధర్మయ్య. సుబ్బారావు మంచంవారగా వచ్చి నిలబడ్డాడు. లోతుకుపోయిన కళ్ళు నిలబెట్టి "నువ్వు చాలా కష్టపడుతున్నావు. బాబూ! నేనేం చెయ్యగల్ను" అంటూ వాపోయాడు.

తర్వాత ఏవేవిటో చెప్పాడు. వడ్రంగి సామానుపెట్టికి వెనకతట్టు చెదలు పడుతున్నాయి అన్నాడు. కొడుక్కు పెళ్లిచేస్తే చూసే అదృష్టం తన కుంటుందో లేదో అని కళ్ళనీళ్లు కార్చాడు. కొడుకు పడుతున్న కష్టాలు తల్చుకుని నెత్తి మొత్తుకున్నాడు. రత్నాన్ని గురించి చెప్పుకొచ్చి వాళ్లంతా అదృష్టవంతులు అన్నాడు. ఈ మాటలు వింటుంటే కడుపులో దుఃఖం ఆపుకోలేక పోయాడు సుబ్బారావు. గబగబా గదిలోకి వెళ్ళిపోయాడు. పరుపుమీద పడుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఏ చింతా లేకుండా జీవించవల్సిన వయసులో కూడా తన్నుగురించి బాధపడాల్సి ఒచ్చింది తండ్రికి. తను కష్టపడుతున్నాడు. తన్నుగురించి తండ్రి బాధపడుతున్నాడు. ఎవరికీ సుఖంలేని జీవితం. ఈ తలపుతో హృదయం కృంగిపోయింది. ఏ అభిమానమయితే కులవృత్తిని నేర్చుకుందుకు అడ్డుపడిందో ఆ అభిమానం ఇప్పుడేమైంది? భద్రాచారి చెప్పుకింద తేలులా ఉంటేనే రోజులు ఈమాదిరిగా అన్నా గడుస్తాయి. స్వేచ్ఛ లేదు; స్వతంత్రం లేదు. తన్ను గురించి ఆలోచించుకుంటే తనకే రోత పుడుతోంది. ఈ ఆలోచనలతో మనస్సు అప్రయత్నంగా రత్నం చుట్టూ అల్లుకుపోయింది. నిజంగా రత్నం ప్రయోజకుడు!... స్వేచ్ఛాజీవి!... తను?

★

నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నిర్బలత, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.

సి. పి. ఏ. కంపెని. "ఆయుర్వేదసమాజం" పెరిదేపి—నెల్లూరు జిల్లా.